క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖానాపూర్: ఖానాపూర్, సుర్జాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారి మరమ్మతుల్లో భాగంగా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

ఖానాపూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని సింగాపూర్, రాజురా, బావాపూర్(ఆర్) గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. మౌలిక వసతులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సునీల్ రెడ్డి, శ్రీనివాస్, బాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



పట్టుకున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కుభీర్: మండలంలోని సిర్పెల్లి గ్రామ సమీపంలోని దేశీదారుని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం 'యథేచ్ఛగా దేశీదారులు విక్రయాలు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. సిర్పెల్లి రోడ్డు పక్కన ఉన్న బి.విఠల్ చేనులోని రేకుల షెడ్డులో నిల్వ చేసిన దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం

ఖానాపూర్: పట్టణంలోని రహదారులపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓం కాళీమాత గోశాలను సందర్శించారు. మొదటిసారి జరిమానా విధించిన పశువులను తిరిగి రోడ్డుపై వదిలితే రెట్టింపు జరిమానా విధిస్తామన్నారు. పశువుల యజమానులు తగు జాగ్రత్తలు పాటించి రోడ్లపై పశువులు సంచరించకుండా చూడాలన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో రాజేందర్ మాట్లాడుతూ అర్హులైన దంపతులకు తాత్కాలిక, శాశ్వత కుటుంబాన్ని నియంత్రణ పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ సురేశ్, ఆశిష్ రెడ్డి, బారె రవీందర్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీని సందర్శించిన విద్యార్థులు

బాసర: నిజామాబాద్ జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్ సాలోరా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసరను సందర్శించారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు దేవరాజ్, శ్రీనివాస్, అధ్యాపకులు రాజేందర్, రాకేశ్, రోషన్ పాల్గొన్నారు.

మైసమ్మకు బోనాలు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శుక్రవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో గ్రామ ప్రధాన వీధులగుండా ఆలయానికి చేరుకున్నారు. మల్లన్న సహిత మైసమ్మ తల్లికి బోనం, నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

గ్రామస్తుల సహకారం మరువలేనిది

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసేందుకు గ్రామస్తుల సహకారం మరువలేనిదని మండల తహసీల్దార్ విశ్వంబర్, మండల విద్యాధికారి గంగాధర్ కొనియాడారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతిని ప్రారంభించారు. పాఠశాలలో 135 మంది విద్యార్థులు చదువుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎస్సై సాయికుమార్, ప్రధానోపాధ్యాయులు పురోషోత్తం రెడ్డి, పీఆర్టీయూ నాయకులు కోట వేణు, వెంకటరమణ, కొమురయ్య పాల్గొన్నారు.

ఇంటికే ఓటరు కార్డు

- 15 రోజుల్లో అందేలా చర్యలు
- కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఓటరు నమోదును ప్రోత్సహించడానికి సరికొత్త మార్గం



నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంతోపాటు 18 ఏళ్లు నిండినవారు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లో ఇంటికే ఓటరు గుర్తింపు కార్డులు అందించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో యువతను చైతన్యపర్చేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

మార్పులు, చేర్పులు సైతం..

ఇదివరకే ఓటరుగా నమోదై జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సైతం 15 రోజుల్లోనే ఇంటికే ఓటరు కార్డు పంపించనున్నారు. ఇప్పుడు ఉన్న సిస్టం ప్రకారం ఓటర్లకు ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెలకు పైగా సమయం పడుతుంది. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టింది.

దరఖాస్తు విధానం

ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ నంబర్, ఈ మెయిల్‌ఐడీతో సైనప్ కావాలి. క్రియేట్ చేసిన అకౌంట్ పై క్లిక్ చేసి పేరు, పాస్‌వర్డ్ నమోదు చేసి, నిర్ధారించాలి. వెంటనే సైనప్ అయిన మెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దాంతోపాటు ఓటరు వివరాలు నమోదు చేయాలి. తర్వాత మొబైల్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా నమోదు చేసి, ఓటీపీతో లాగిన్ అవ్వాలి. కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారు ఫారం–6తో వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర వివరాలు నమోదు చేయాలి. అడిగిన ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. వివరాలను మరోసారి సరిచూసుకుని సబ్మిట్ చేయాలి. ఫారం–8 ద్వారా మార్పులు చేర్పులు, ఫారం–7 ద్వారా ఓటరు పేరు తొలగించుకోవడానికి వీలుంటుంది.

స్టేటస్ తెలుసుకోవడానికి

ఎన్వీఎస్పీ పోర్టల్‌లో మొబైల్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా నమోదు చేసి ఓటీపీతో లాగిన్ కావాలి. ట్రాక్ అప్లికేషన్ స్టేటస్ పై నొక్కాలి. దరఖాస్తు చేసిన సందర్భంలో ఎస్ఎంఎస్ వచ్చిన రెఫరెన్స్ నమోదు చేయాలి. రాష్ట్రం ఎంపిక చేసి, సబ్మిట్ చేస్తే దరఖాస్తు స్టేటస్ తెలుస్తుంది.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి



అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును పొందాలి. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అర్హులకు 15 రోజుల్లోనే గుర్తింపు కార్డు రానుంది.

– కిశోర్‌కుమార్, అదనపు కలెక్టర్

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న సిబ్బంది



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం గృహ సముదాయం సమీపంలోని మినీ క్రీడా మైదానంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, డీఈఈ సంతోష్, మున్సిపల్ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా కార్యాలయ సిబ్బంది మొక్కలు నాటారు. ఎంపీడీవో సాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ రహమాన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి..

కడెం: మొక్కలు నాటి సంరక్షించాలని ఉడుంపూర్ ఎఫ్ఆర్వో అనిత అన్నారు. శుక్రవారం కల్లెడ ఆటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజన్న, అధ్యాపకులు స్వామి, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, రజిత, లక్ష్మీరాజం, నరేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

'పని చేసే వారికే గుర్తింపు'

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికే గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అందరూ సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఇన్‌చార్జిలు అవేజ్, చంద్రశేఖర్ గౌడ్, రాంభూపాల్, మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్, రేఖ శ్యాం నాయక్, దండే విఠల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందాడి అనిల్ కుమార్

అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసిన నేతలు

కడెం: జిల్లా కేంద్రానికి వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్‌కుమార్ యాదవ్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: దశల వారీగా గ్రామాల అభివృద్ధి చేస్తామని ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోంద్రట్ గ్రామంలో రూ. 35.10 లక్షలతో చెరువు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని హిప్నెల్లి, చెరువుకు రూ. 89.40 లక్షలు, బెంబర చెరువు మరమ్మతులకు రూ. 49.6 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా చెరువు కట్టపై మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, శివాజీ పటేల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

అప్రమత్తంగా ఉండాలి



ఇంటి పరిసరాలు పరిశీలిస్తున్న వైద్యాధికారి

సారంగపూర్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్దుల్ జవాద్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి డ్రై డే ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, డయేరియా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. సిబ్బంది నిత్యం పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రాధ, సునీత, ఆశ కార్యకర్త లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు తహసీల్దార్‌గా మహేందర్‌నాథ్

తానూరు: తానూరు తహసీల్దార్‌గా శుక్రవారం మహేందర్‌నాథ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పదవీ విరమణ చేపట్టడంతో, మంచిర్యాల జిల్లా నెన్నెల తహసీల్దార్‌గా పని చేసిన మహేందర్‌నాథ్ తానూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

కుంటాల ఎంపీడీవోగా వనజ

కుంటాల: కుంటాల ఎంపీడీవోగా అల్లాడి వనజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నిజామాబాద్ జిల్లా మెండోరా ఎంపీడీవోగా విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమెను అధికారులు, సిబ్బంది సత్కరించారు.

బాసర ఎంపీడీవోగా దేవేందర్

బాసర: మండల ఎంపీడీవోగా దేవేందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన అశోక్ కుమార్ ముధోల్ సూపరిండెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఎంపీవో గంగాసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, అధికారులు సత్కరించారు.

ఏఐపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు చాట్ జీపీటీపై యూనిసెఫ్ జిల్లా మేనేజర్ సుమలత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

గోరింటా పండింది



లోకేశ్వరం మండలంలోని రాజూర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు గోరింటాకు తీసుకువచ్చి చేతికి పెట్టుకున్నారు. ఎర్రగా పండిన గోరింటాకును చూసి మురిశారు.

– లోకేశ్వరం

మేదరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖానాపూర్: మేదరి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మదిరె సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో మేదరి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. మేదరి సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు సిలివేరి లక్ష్మినర్సయ్య, ఊరే దశరథ్, మదిరె శ్రీనివాస్, ఎనగందుల హరీశ్, గైని నర్సయ్య, బొమ్మెడి రాజేందర్, ఎనగందుల బుచ్చన్న, మదిరె గంగరాజం, మదిరె పెద్దులు, పిల్లి శ్రీనివాస్, ఊరే శ్రీనివాస్, సతీశ్, గంగాధర్ పాల్గొన్నారు.



వర్కింగ్ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న నాయకులు

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

సారంగపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్న రుణాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు నవీన్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖను పరిశీలించారు. అక్కడే బ్యాంకు వద్ద ఉన్న వినియోగదారులకు డిజిటల్ రుణాలు, డిజిటల్ చెల్లింపులు, డిపాజిట్‌లు, పొదుపు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పవద్దన్నారు. అనంతరం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట జామ్ బ్యాంకు మేనేజరు రాజేశ్వర్, ఆలయ అర్చకులు ఉన్నారు.

స్వచ్ఛతపై దృష్టి సారించాలి

కుంటాల: గ్రామాల్లో స్వచ్ఛతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) ప్రియాంక అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కల్లూరు గ్రామంలో సర్వే నిర్వహించారు. గ్రామంలోని దేవాలయాలు, ప్రార్థన మందిరాలు, పాఠశాలలు, డంపింగ్ యార్డ్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆమె వెంట ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా కుంటాలలో ఇంటింటా పర్యటించి వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పనికిరాని పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు, హెచ్ఎన్వీఎన్ ప్రసాద్, ఆశవర్కర్లు దేవకి, విజయ, మమత, లక్ష్మి పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న ప్రియాంక

ఖానాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో డ్రైడేలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సందర్శించి త్వరితగతిన పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమీర్ హుస్సేన్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేపర్ బ్యాగులపై అవగాహన

భైంసారూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలోని మహాగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేపర్ బ్యాగులపై శుక్రవారం ఉపాధ్యాయులు కృష్ణ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లతో కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, ఉపాధ్యాయులు అశోక్, కృష్ణ, హరీశ్, రాగిణి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జెడ్పీ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం పేపర్ బ్యాగ్ డే ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలించి, పేపర్ కవర్లను వాడాలని పేపర్ బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం భూమేష్, ఎన్‌సీసీ అధికారి బొమ్మిడి మహేశ్వర్, బాలాజీ, పీడీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ

'ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు'

సారంగపూర్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని చించోలి(బి) మహాత్మా జ్యోతిబాపూలే, బీసీ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్, గంజాయి, డయల్ 100, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. మానసిక, శారీరక ఒత్తిడి కలిగించేలా వ్యవహరిస్తే, ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్, కానిస్టేబుల్ వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

శివాజీ విగ్రహావిష్కరణ

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. యువకులు, గ్రామస్తులు విరాళాలతో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువకులు మధు, ప్రశాంత్, సాగర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు..

ఆర్థిక సాయం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలోని నాగనాయిపేట్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూంలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పుప్పాల రాజేశ్వర్ మరణించగా అతని అంత్యక్రియలను శుక్రవారం నిర్మల హృదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నిర్మల హృదయ సేవా సమితి అధ్యక్షుడు నాయిడి రమేశ్, సాధం ఆనంద్, శ్రీరాముల శ్రీనివాస్, ఏపూరి ప్రమోద్, చిన్ను పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికపై సమీక్ష

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వంద రోజుల ప్రణాళికపై సీడీఎంఏ ఫైనాన్స్ మేనేజర్ శ్రీపాద రాజేశ్వర్ శుక్రవారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, మెప్మా, రెవెన్యూ, భవన నిర్మాణ విభాగం సెక్షన్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ డీఈ హరి భువన్, మెప్మా పీడీ సుభాష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కడెం: మండల కేంద్రానికి వచ్చిన మంచిర్యాల జిల్లా స్కౌట్ ఆర్గనైజర్ కత్తెరపాక రాజేశ్‌ను మండల కేంద్రంలోని బృందావన్ రిసార్ట్స్‌లో శుక్రవారం స్థానిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కుక్కరికారి రాజేశ్, పడిగెల రాజు, అర్ల రమేశ్, సత్యం, ముత్యం, కరుణాకర్, చంద్రన్న పాల్గొన్నారు.

అన్నదానం కోసం విరాళం

బాసర: శ్రీజ్ఞాన సరస్వతి నిత్యాన్నదాన సత్రంకు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అందించే అన్నదానం కోసం భక్తురాలు విరాళం అందజేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన నిమ్మగడ్డ నిత్య అనే భక్తురాలు అమ్మవారికి దర్శనానికి వచ్చి నిత్య అన్నదాన సత్రంకు రూ. 25 వేల రూపాయల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి. సుధాకర్‌రెడ్డికి అందజేశారు.

నేడు బాసరకు రాష్ట్ర మంత్రి రాక

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రానున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మమ్మాయి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.